


మధ్యాహ్నం పన్నెండు గంటలవుతోంది.

నేను ఆఫీసునుండి ఇంటికి వచ్చేసరికి ముఖంనిండా దుప్పటి ముసుగువేసుకుని మంచంమీద పడుకుంది అమ్మ. వేళకాని వేళ అమ్మ అలా పడుకునేసరికి నాకు భయంవేసింది. రోజూ నేనూ, తులసి ఆఫీసునుండి వచ్చేంతవరకు అమ్మ

భోజనం చేయకుండా మాకోసం ఎదురు చూస్తూ కూర్చుంటుంది. మేం వచ్చిన తరువాత మా కందరికీ వడ్డించేసాక అమ్మ భోజనానికి కూర్చుంటుంది. "మేం వచ్చేంతవరకూ భోజనం చెయ్య కుండా నువ్వు కూర్చోవద్దు," అని ఎన్నిసార్లు చెప్పినా అమ్మ మా మాట వినదు. అంతే కాకుండా ఇంట్లో ఎంతమంది ఆడవా ళ్ళున్నా అమ్మ వాళ్ళని ఇంట్లో ఏ పనీ చెయ్యనివ్వదు. సరికదా, వాళ్ళపనులు కూడా అమ్మే చేసి పెడుతూ ఉంటుంది. అందుకే ఒక్కోసారి అనిపిస్తుంటుంది. 'అమ్మకి అందర్నీ సుఖపెట్టటం తెలుసు కాని, ఎవరివల్లనూ తను సుఖపడ్డం అమ్మకి తెలియదు.' ఆలోచిస్తూ కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటున్నాను. ఇంతలో తులసి తువ్వాల్తో ముఖంతుడుచు కుని ఇంట్లోంచి వస్తోంది.

"ఎంత సేపయింది వచ్చి?"

"ఇప్పుడే. పదినిమిషాలవుతుంది."

"అమ్మ పడుకుందేం?"

"ఏమో!" తులసి జవాబునాక్కొంచెం చిరాకు కల్గించింది. 'ఆఫీసు నుండి రోజూ ఇంటికి రాగానే గాభరాపడుతూ తమ క్రింద సేవలు చేస్తున్న అమ్మ ఎందుకు పడుకుందో కూడా తెలుసు కునేపాటి కనీస బాధ్యత తులసికి ఉండక్కర్లేదూ?' అని మనసులోనే అను కుని పైకి ముభావంగా ఊరుకుని అమ్మ దగ్గరికి వెళ్ళి వొంటిమీద చెయ్యివేసే సరికి అమ్మ ఒళ్లు వేడిగా కాలిపోతోంది.

"అమ్మా! పడుకున్నావేం? వొంట్లో ఎలా ఉంది?"

"ఏంలేదు బాబూ!...కాస్త నలతగా ఉంటే పడుకున్నాను," అని దుప్పటి తీసేసి "నా మతి మండిపోను ... అమ్మా... తులసీ ...ఎంత సేపయింది వచ్చి? కాళ్ళు కడుక్కోనిరండి ... వడ్డిస్తా," అంటూ అమ్మ లేవబోతుంటే నాకు కళ్ళలో ఆనందంతోనో, దుఃఖం తోనో చెప్పలేను గాని గిర్రున నీరు తిరిగింది. అమ్మ మాకోసం పడే తాపత్రయంలో కనీసం నూరోవం తయినా అమ్మకోసం మేం పడలేక పోతున్నామేమో ననిపించింది.

"మీరు పడుకోండత్తయ్యా!...నేను వడ్డిస్తాలెండి," అంది తులసి.

"అయ్యో!... నాకేమయిందమ్మా ఇప్పుడు?...వడ్డించుకు నువ్వేం తిన గలవ్?...పదపద..." అంటూ అమ్మ లేవబోతోంటే,

"నువ్వేం లేవనక్కర్లేదు. నీకోడ లేం కందిపోదులే ఈ ఒక్కపూటకి. పడుకుని కొంచెం విశ్రాంతి తీసుకో," అని నేను గట్టిగా కసరుకోవటంతో చేసేదిలేక పడుకుండిపోయింది. భోజనాల దగ్గర కంచాలు, గ్లాసులు పోట్లాడుకోవటంవల్ల తులసికి నామీద బాగా కోపం వచ్చేసి నట్లు అర్థమయింది. రోజూ నవ్వుతూ

వాళ్ళ స్కూలు కబుర్లుచెప్పే తులసి మౌనంగా ఉండిపోయింది. తులసిని ప్రసన్నం చేసుకోడానికి ఏదో మాట ల్లోకి దింపాలని ప్రయత్నించి "ఇవ్వాళ మీ స్కూలు విశేషాలేం లేవా?" అని ప్రశ్నించాను. తులసి జవాబుచెప్పకుండా ఊరుకుంది.

"తులసీ! నువ్విలా మాటాడకుండా కోపంతో ముఖం ముడుచుకుని కూర్చుంటే ఎలా ఉన్నావో తెలుసా? ఇంకా అప్పుడే వికసించబోయే..."

"చాల్లెండి మీ వర్ణనలు. 'అందితే పిలకా లేకపోతే కాళ్ళూను' ......కూర చాలా మరి కొంచెం వేసేదా?" అంది.

"ఇన్నాళ్ళకి నీ చేత్తో వడ్డిస్తోంటే ఎలా సరిపోయిందని చెప్పగలను?" అన్నాను

"నేను గరిటతో వడ్డిస్తున్నాను. చూస్కోండి?" చిరుకోపంతో అంది.

"అమ్మో!... మహంకాళీ!...గరి టతో ఎక్కడ వడ్డించేస్తావ్ తల్లీ!" నవ్వుతూ అన్నాను. ఆ మాటతో తులసి కోపం ఎగిరిపోయి పకాలున నవ్వింది. ఆమాత్రం చిటపటలు లేకపోతే సంసా రంలో సారం ఏముంది చెప్పండి?... మరి ఫరవా లేదనుకున్నాను.

"తులసీ! అమ్మకి ఒంట్లో బాగు లేదు. మధ్యాహ్నం సెలవు పెట్టవూ? సాయంకాలం నేను డాక్టర్ని తీసుకొస్తా" అన్నాను.

"మా హెచ్చెమ్ ఏమంటాడో... అసలే తిక్కవాడు."

"ఫరవాలేదు. నేనెళ్ళి రిక్వెస్ట్ చేస్తా. లీవులెటరు వ్రాసిచ్చేసి," అని భోజనం చేసి, మధ్యాహ్నం ఆఫీసు కెళ్ళినపుడు వాళ్ళ స్కూల్లో తులసి లీవులెటరిచ్చేసి వెళ్ళిపోయాను.

సాయంకాలం ఆఫీసు అవర్సు అయిన వెంటనే పనిముగించుకు బయలుదేరి నేరుగా మా డాక్టరుగార్ని తోడ్కొని ఇంటికెళ్ళాను. ఇంటికెళ్ళేసరికి ఇల్లంతా సందడిగా ఉంది. అమ్మకూడా ప్రక్క మీద కూర్చుని మా పెద్దన్నయ్య కొడు కుని ఒళ్ళో బెట్టుకుని ముద్దాడుతోంది. మావాళ్ళంతా మాస్టర్లే అవటంచేత ప్రతిసంవత్సరం స్వంత ఊర్లో ఉంటున్న నా దగ్గరకే వస్తుంటారు పండుగ సెల వలకి. ఆ సెలవలన్నాళ్లూ హాయిగా గడిచిపోతుంది. అందరం కలుసుకున్నం దుకు నేనూ సంబరపడ్డాను. తర్వాత డాక్టరుగారు ధర్మామీటరుతో అమ్మ టెంపరేచరు చూస్తే నూటమూడు డిగ్రీల జ్వరం ఉంది. ఇంజక్షన్‌చేసి, టాబ్లె ట్లిచ్చి బాగా విశ్రాంతి తీసుకోమనిచెప్పి వెళ్ళిపోయారు. కొడుకులూ, కోడళ్ళూ వచ్చారన్న సంతోషంతో అమ్మ లేచి పనిచెయ్యబోతూ ఉంటే నేనూ మా అన్నయ్యలూ దెబ్బలాడటంతో విధిలేక అమ్మ మంచంమీద మేను వాల్చింది.

ఆ తరువాత అన్నయ్యలూ, వది

నలూ, మా తులసివాళ్ళ స్కూలు విషయాలు చెప్పుతోంటే, నేను నా ఆఫీసు విషయాలు చెప్పుకుంటూ పదకొండు గంటలవరకూ కాలక్షేపం చేసేసాం. అప్పుడు మంచంమీద పడుకున్న అమ్మ మూలుగు వినిపించింది. కాళ్ళు నొప్పులుగా ఉన్నాయో ఏమో అమ్మ తన కాళ్ళు తనే పట్టుకుంటోంది. పెద్దన్నయ్య వదినని పిల్చి అమ్మకాళ్ళ మీదనోసారి చెయ్యి వెయ్యమన్నాడు. వదిన రెండునిమిషాలు బద్ధకంగా వొళ్లు విరుచుకుని, "అబ్బా, ప్రయాణబడలిక వల్ల నాకే వొళ్ళంతా నెప్పిగా ఉందండి. నిద్ర ముంచుకొచ్చేస్తోంది," అంటూ అక్కణ్ణించి లేచిపోయింది. తరువాత చిన్నన్నయ్య మా చిన్నవదినకి అదే విషయం చెప్పగా ఆవిడ వినీ విననట్టు వెళ్ళిపోయింది. ఆపై మిగిలింది నేను కాబట్టి మా తులసిని ప్రక్కకి పిల్చి "అమ్మకి కాళ్లు పీకుతున్నట్లుంది. ఓసారి పట్టవూ?" బ్రతిమాలుతున్నట్లు అన్నాను. తులసికూడా కొంతసేపు తటపటాయించి చేసేదిలేక అమ్మకి కాళ్లొత్తసాగింది. "అయ్యో...నీకు మతిలేదా?...వాడికి మతిలేదా? నాకేకాళ్ళూ ఒత్తనక్కర్లేదమ్మా! వెళ్ళి పడుకో. అసలే నువ్వు ఉత్తమనిషివికూడా కావాయె!" జ్వర తీవ్రతచే ఆ మాటలు అనలేక ఆయాస పడుతూ ఆయాసపడ్తూ అంది. అమ్మ అమాయకత్వానికీ, కోడళ్ళ గడుసుతనానికీ సరిపోయిందనుకున్నాం. తరువాత నేనూ-పెద్దన్నయ్యా చెరోకాలూ ఒత్తుతూంటే చిన్నన్నయ్య అమ్మ చేతులొత్తసాగాడు. అమ్మ సీరియస్‌గా దుప్పటి ముసుగు తీసి చూసి, "ఏంట్రా! మిమ్మల్ని కాళ్లొత్తమని చెప్పిందెవరు?... ఇంకా చిన్నపిల్లలా మీరు?...వెళ్లండి... వెళ్ళండి...మీరేం నాకాళ్ళు పట్టనవసరం లేదు...... పోయి పడుకోండి ...... పన్నెండవుతోంది!" కాళ్ళను దగ్గరగా కూడదీసుకుంది.

"అమ్మా! మేం ఎంత పెద్దవాళ్ళమయినా, నీకంటే చాలా చిన్నవాళ్ళమే నమ్మా... నువ్విలానే ఉండు,నీ మంచితనాన్ని ఆసరగా తీసుకొని కొన్నాళ్ళకి కోడళ్ళు నీకు తిండికూడా పెట్టరు." చీవాట్లేసినట్లుగా అన్నాడు చిన్నన్నయ్య.

"నోర్ముయ్‌రా గాడిదా! చాలు నీ కూతలు...నా కోడళ్ళెవరనుకున్నావ్? బంగారు తల్లులు," అని మమ్మల్ని చీవాట్లేసి కోడళ్ళను వెనకేసుకొచ్చింది.

* * *

తెల్లవారింది గోడ గడియారం అయిదుగంటలు కొట్టడంతో మెలకువ వచ్చింది. రాత్రి పన్నెండుగంటలవరకు మేల్కొని ఉండటంచేత పడుకున్న వెంటనే నిద్రపట్టేసింది బాగా. అమ్మకి ఎలావుందో చూదామని మంచందగ్గర కెళ్ళాను. అమ్మ లేదక్కడ. వంటింట్లో గ్యాస్ స్టౌవ్ వెలుగుతూ కనిపించింది.

అమ్మదగ్గర కెళ్ళాను. అమ్మపై బాగా కోపం వచ్చేసింది నాకు. "అమ్మా ! ఇప్పుడేం కొంప మునిగిపోయిందని?... కోడళ్లున్నారుగదా !...ఆ మాత్రం పని చేయకపోరు. నీ ఒంటికేదేనా వస్తే చేసేవాళ్ళే ఉండరు ... తరువాత నీ ఇష్టం," అన్నాను.

"చాల్లేరా నీ మాటలు ! రాకరాక వస్తే వాళ్ళచేత పనిచేయించమంటు న్నావ్. ఎవరేనా వింటే నవ్విపోగలరు. పో. అన్నయ్యలని లేపు వెళ్ళి. కాఫీ తయారయింది," అని అంటున్న అమ్మని చూసి ఏమనాలో అర్థంకాక అక్కణ్ణించి తప్పుకుని ముఖం కడు క్కోడానికి వెళ్ళిపోయాను.

తరువాత తులసి ఒట్టిమనిషికాదని బోన్విటా, కాఫీ త్రాగదని పెద్దవదినకి పాలు మాకందరికి కాఫీలు అందిస్తున్న అమ్మను చూస్తున్నప్పుడు మాకు అనిర్వచనీయమైన ఆనందం కలిగి, ఆ తల్లికి కొడుకులమై పుట్టినందుకు మేం ఎంతో అదృష్టంగా భావించాం.

పండగకి అన్నయ్యలకి ఇష్టమని మైసూరుపాక్, నాకోసం 'కోవా', ఇంకా కోడళ్ళకి, కూతుళ్ళకి ఎవరికి యిష్టమైనవి వారికి చేసిపెడుతుంటే అందరం హాయిగా కాలక్షేపం చేసాం. నేనూ, చిన్నన్నయ్య అమ్మ దగ్గర కెళ్ళి, "అమ్మా ! మాకందరికీ యిష్టమైనవి పేరుపేరున చేసి అందించావ్ కదా ! మరి నీ కిష్టమని ఏం చేసుకున్నావ్ ?" అని అడిగాం. అమ్మ మావేపు చూసి ఓసారి నవ్వి, "మీ అందరూ ఇలా ఓచోట పండుగ చేసుకోవటం, మీకేం కావాలో వాటిని చేసి మీకు పెట్టడం. అదీ నా కిష్టం," అంది అమ్మ.

అలా అంటున్నప్పుడు అమ్మ కళ్ళు ఎంత స్వచ్ఛంగా వెలిగాయని ! మనసు ఆ కళ్ళలో ఎంత నిర్మలంగా కనిపించిందని.

* * *

"ఏమండీ !"

"ఏమండీ," తలసిని దగ్గరగా తీసుకుంటూ కొంటెగా.

"మీ చిన్నవదిన అత్తయ్యను తనతో తీసుకుపోతామంటున్నారు !"

"పోనీ. తీసికెళ్ళనీ," తులసిని అల్లరి పెడదామని అనిపించి అన్నాను.

"అది కాదండీ...మా దసలే ప్రయివేట్ మేనేజ్మెంటు స్కూలు. పని ఒత్తిడి ఎక్కువ ... అందునుంచి అత్తయ్య మన దగ్గరే ఉంటే..." అంటున్న తులసి మాటల్ని పూర్తి కానివ్వకుండానే, "పోనీ. ఉద్యోగం అంత కష్టంగా ఉంటే రిజయిన్ ఇచ్చెయ్ రాదూ !" తులసిని కొద్దిగా ఏడిపించే రీతిలో అన్నాను.

"మీరూ రిజయిన్ యిచ్చేసి కూర్చోండి. బాగుంటుంది !" కోపంగా నా చేతులు విడిపించుకుని ప్రక్కకి

తిరిగి పడుకుంది. తులసిని నా ప్రక్కకి త్రిప్పుకుని, "ఏమమ్మాయ్ ! అమ్మకి జ్వరం వస్తే కాళ్లొత్తడానికి మీకు సిగ్గనిపించిందీ ! మరి అమ్మకి మీ సేవలు చెయ్యటం తన్నచినం కాదూ ... చెప్పమ్మా !" అన్నాను.

"నేను కాళ్లొత్తనన్నానా ఏం ?... ప్రతిదానికి దెప్పుతారు గాని !" అందంగా ముఖం ముడుచుకుంది తులసి.

"సర్లే. 'శ్రీమతి' గారి ఆజ్ఞ ! తప్పుతుందా ?" అన్నాన్నేను.

తరువాత తులసి ఏదో వారపత్రిక తిరగేయసాగింది. నేను 'న్యూస్' పేపరు చదవసాగాను. కొద్ది పేజీలు తిరగేసేసరికి కళ్ళు బరువెక్కాయి. తలుపు తెరుచుకొని మంచినీళ్ళకోసం వరండాలోకి వెళ్లేసరికి ప్రక్కగదిలోంచి వినవస్తున్న మాటలు–

"ఈ పిల్లల్తో నేనొక్కర్తినీ చాకిరీ చెయ్యలేను. ఈసారి అత్తయ్యని మనతో తీసుకుపోదాం," అంటోంది పెద్దవదిన.

"ఇద్దరు పిల్లలకి చెయ్యడానికే ఇంత కష్టపడిపోతుంటే అమ్మ ఈ వయసులో ఇంతమందికి ఎలా చేస్తుందో ఆలోచించు !" అంటున్నాడు అన్నయ్య.

"సర్లెండి. ఈ భారతం కేంగాని... అత్తయ్యను మాత్రం కూడా తీసుకెళ్దాం."

"అది నెమ్మదిగా ఆలోచించాల్సిన విషయం," అన్నయ్య మాటలు నాకు నవ్వు తెప్పించాయి. ఆ రాత్రి చాలాసేపటివరకూ 'అమ్మ' గురించే ఆలోచించాను.

* * *

పండుగ సెలవులు ఇంకా రెండ్రోజులున్నాయ్. అన్నయ్యలూ, అక్కయ్యలూ ప్రయాణాల సందడిలో ఉన్నారు. తోడికోడళ్లు ముగ్గురూ 'అత్తయ్య నా దగ్గరుంటుందంటే నా దగ్గరుంటుంద'ని అనుకుంటున్నారు. తుది నిర్ణయంలాగా అక్కయ్య మధ్యలో వచ్చి 'అమ్మ నాతో వస్తుందీసారి' అంది. ఇక లాభంలేదని నాలుగు చీటీలు చించి లాటరీ వేసి అన్నయ్య కొడుకు రెండవ వాడితో ఒక చీటి తీయించారు. ఇదంతా చూస్తున్న మేం మాకేం పట్టనట్టు ఊరుకున్నాం.

"ఒరే తమ్ముడూ ! వీళ్ళంతా అమ్మ మీద అభిమానంచేతనే అమ్మని తమతో రమ్మంటున్నా రనుకుంటున్నావా ?" అన్నాడు చిన్నన్నయ్య. "నన్నడుగు. నేం చెపుతాను. మీ పెద్ద వదిన వారం రోజులుగా రోజూ రాత్రి ఇదే పోరనుకో. ఎందుకో తెలుసా ? ఆవిడకి మహిళా మండలి మీటుంగులకి వెళ్ళాలని కోరిక. ఇంట్లో పని ఎక్కువ. అందుకని ఇంట్లో పని చేసేందుకు ఆవిడకి అత్తయ్య కావాలి! ఇకపోతే పెద్ద మరదలి బాధ– 'అత్తయ్య చిన్న మరదలికి చేసేస్తోందే. మరి తనెందుకు కష్టపడాలి?' అని. మరి తులసి సంగతంటే– దానికి స్కూలు, ఇంటి పని. స్కూలులో ఆవిడ పనిచేసు

కుంటుంది. ఇంటి పని చెయ్యటానికి అత్తయ్య కావాలి!... ఇక అక్కయ్య సంగతి చెప్పనా... ఆవిడ తహశీల్దారు గారి భార్య. ఇంటిపని చేసుకోటానికి ఆవిడకి చిన్నతనం. అందుకంచి అమ్మ కావాలి అక్కయ్యకి... ఇదీ వాళ్ల అభిమానం!" అని పెద్దన్నయ్య ఉన్న విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పేసరికి ముగ్గురం గొల్లున నవ్వుకున్నాం. వాళ్ళ తోడి కోడళ్ళలోంచి కూడా గోల వినిపించేసరికి అక్కడికి వెళ్ళాం

"అమ్మ ఎవరి వాటా వచ్చిందర్రా?" అన్నాడు పెద్దన్నయ్య. మాఅమ్మ తులసి పిన్ని దగ్గిరే ఉండాలిట" గెంతుతూ అన్నాడు వాడు. తులసి ముఖం మెరుగు పట్టిన బంగారంలాగా ఉంది, తన నంబరు లాటరీలో గెల్చినందుకు.

"అమ్మా! ఈ లాటరీల్తో సంబంధం లేదు. నీ కెక్కడుండాలని ఉంటే అక్కడ ఉండు. ఎవర్ని చూడాలని ఉంటే వాళ్ల దగ్గరికి వెళ్ళు. నీకేం అభ్యంతరం లేదు." ఖండితంగా నేను చెప్పేసాను.

"చూడండర్రా! తులసి ఉత్తమనిషి కూడా కాదు. అది పురుడయి దాని బిడ్డకు మూడోనెల వచ్చినంతవరకూ దాని దగ్గరుండి తీరాలి! తరువాత నేనే వస్తా మీ దగ్గరికి," అన్నది అమ్మ.

"ఇదిగో అమ్మాయిలూ! మీరంతా వినండి. ఓ షరతు. ఈసారి కెలాగో అయిపోయింది కాని- ఇకపై అమ్మ ఎవరి దగ్గరున్నా సరే- అమ్మ యిక్కడ చీపుర అక్కడ పెట్టడానికి కూడా వీల్లేదు. పిల్లల్ని ఆడించుకుంటూ 'రామాకృష్ణా' అంటూ కూర్చోవాల్సిందే! అందు కిష్టపడిన వాళ్లే అమ్మని తీసుకెళ్ల వచ్చు. అమ్మచేత సేవలు చేయించు కొని మీరు బాతాఖానీ కొడదామనుకుంటే మాత్రం వీలులేదు." పెద్దన్నయ్య అనే సాడు.

"నోర్ముయ్యరా గాడిదా! నలుగురూ నవ్విపోగలరు.నా పిల్లలకి...నా కోడళ్లకి నేను చెయ్యప్పోతే ఇంకెవరు చేస్తార్రా? గొప్ప తెలిచితేటలు సంపాయించార్లెండి. చదవేస్తే ఉన్న మతి పోయినట్లుంది. ఇదిగో అమ్మలూ! నాకంఠంలో ప్రాణం ఉండగా మరెవరూ నా క్రింద చెయ్యడానికి వీల్లేదు. ఒరేయ్! మీకూ చెప్తున్నాను. మళ్లీ ఇలా ఓసారి వాగినట్టయితే పళ్లూడగొడ్తా మీ అందరికీ. జాగర్త!... ఆహా..." కోపంగా ఇటూ అటూ తిరిగేసూ అంది. ఇక అక్కడుండక అన్నయ్య కొడుకుని చంకన వేసుకుని వెళ్ళిపోయింది. మేం అమ్మని చూస్తూ అలానేఉండిపోయాం! ఆడవాళ్లంతా కళ్ళప్పగించి ఉండి పోయారు.

అమ్మ అందరికీ కావాలందుకే!

అమ్మకీ మేం అందరం కావాలి—

అనురాగం పంచి ఇవ్వటానికి!